క్లుప్తంగా

ఉపాధి ఏపీడీగా సునీల్ కుమార్



నిండ్ర: నగరి డివిజన్ ఉపాధి ఏపీడీగా సునీల్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఏపీడీ తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా ఉద్యోగోన్నతి పొంది వెళ్లారు. చిత్తూరు ఉపాధి కార్యాలయం నుంచి సునీల్‌కుమార్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పరిపాలనపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: గ్రామీణ సాధారణ పరిపాలన గురించి ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు బుధవారం ఎంపీడీఓ విద్యావతి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు హక్కులు, విధులు, బాధ్యతల గురించి వివరించారు. అభివృద్ధి చేయడానికి సర్పంచులే కాదు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కూడా కృషిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విజయపురంలో 82 ఎంఎం వర్షపాతం



పన్నూరు ఎస్టీ కాలనీలో పూరిగుడిసెను పరిశీలిస్తున్న తహసీల్దార్

విజయపురం : మండలంలో రెండు రోజులుగా 82 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ అనూష తెలిపారు. అలాగే తుపాను ప్రభావిత ప్రాంతాలను తహసీల్దార్ కిరణ్ బుధవారం పరిశీలించారు. పన్నూరు ఎస్టీ కాలనీలో ఓ గుడిసె గోడ కూలినట్లు గుర్తించారు. అలాగే ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ చెరువులను పరిశీలించారు. మండలంలో సుమారు 75 చెరువుల్లో నీరు చేరింది. ఎక్కడగానీ ఎలాంటి ప్రమాదం లేదని, పంట నష్టం ఎక్కడా చోటుచేసుకోలేదని వ్యవసాయాధికారిణి రజిని కుమారి తెలిపారు.

వరి పంట మునక



అత్తూరు గ్రామంలో నీట మునిగిన వరి

నిండ్ర: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి నాట్లు వేసిన పొలాల్లో నీరు చేరి మునకేశాయి. అలాగే మండలంలోని పలు చేరువులకు నీరు చేరింది. పలు గ్రామాల్లో వర్షానికి రోడ్లు గుంతలమయయ్యాయి.

భక్తిప్రపత్తులతో మండలాభిషేక పూజలు



ఆలయంలో చేస్తున్న యాగశాల పూజ

విజయపురం: మండలంలోని పన్నూరులో నూతన వరసిద్ధి వినాయక ఆలయంలో మండలాభిషేక పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయంలో కలశ పూజలు, గణపతి పూజ, యాగశాల పూజ, పూర్ణాహుతి, అభిషేకం, విశేష అలంకారం, గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. మూల విరాట్‌ను పట్టు వస్త్రాలు, పుష్పాలతోను అలంకరించారు. ఊరేగింపుగా వచ్చిన వినాయకస్వామికి భక్తులు తమ ఇళ్లవద్ద కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు సమర్పించారు.

శ్రీకృష్ణుడికి పౌర్ణమి హారతి



గీతామందిరంలో శ్రీకృష్ణుడికి మహిళల పూజలు

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గీతా మందిరంలోని శ్రీకృష్ణునికి బుధవారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం గీతా పారాయణం, భజనలు నిర్వహించారు. మహిళలు శ్రీకృష్ణ భగవానుడికి పౌర్ణమి హారతులిచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తిని ఉయ్యాలసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వర్షపు నీటి గుంతలతో బొమ్మవారిపల్లె రోడ్డు



తూగుండ్రం రోడ్డు



రోడ్లు ఛిద్రం..ప్రయాణం నరకం

మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. పలు ప్రాంతాల రోడ్లు గుంతలమయమై, చిన్నపాటి నీటి కుంటలను తలపిస్తుండడంతో ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అది గుంతనో, నిలిచి ఉన్న వర్షపు నీరో తెలియక అదుపు తప్పి పడి గాయాలపాలవుతున్నారు. రోడ్ల దుస్థితికిపై గతంలోనే ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి ఎన్నోసార్లు నివేదించినా మరమ్మతులు చేయించిన పాపానపోలేదని ప్రజలు మండిపడుతున్నారు.

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు



కొట్రకోన రోడ్డు



ముక్కలతూరు రోడ్డు

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం రోడ్డు, కొట్రకోన రోడ్డు, ఎస్ఎస్ కొండ రోడ్డు మార్గాలు ఎటుచూసినా గుంతలమయమయ్యాయి. తూగుండ్రం పాల డెయిరీ నుంచి పిల్లారి కుప్పం రోడ్డు వరకు గుంతలు..గుంతలుగా ఉంది. గంగాధర నెల్లూరు మండల ఆఫీసుకు, ఇటు పక్క మండలమైన పాలసముద్రం మండలానికి ప్రధాన రహదారి ఇదే. నిత్యం చుట్టుపక్కల గ్రామాలను వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డులో పెద్దపెద్ద గుంతల మూలాన వాహనాలు అదుపు తప్పి పలువురు గాయపడిన ఘటనలు గతంలో కోకొల్లలు. వీటికి మరమ్మత్తులు చేయకపోవడం వల్ల ఈ మార్గాల్లో ప్రయాణం ఒక శాపంగా మారింది. జీడి నెల్లూరు మండల కేంద్రంలోని నీవా నది వంతెనపై ఓ వైపు గోడ కూలిపోయింది. వంతెన ప్రారంభంలో ఒక పెద్ద గుంత ఏర్పడింది. చిత్తూరు వైపు నుంచి జీడి నెల్లూరులో వచ్చేవారు ఆ గుంత మూలాన ఎందరో ప్రమాదాలకు గురయ్యారు. పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, నెల్లేపల్లె రహదారిలో సైతం ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నా అధికారుల్లో చలనం లేదు. కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు జేబులు నింపుకోవడంపై చూపుతున్న శ్రద్ధ రోడ్లను బాగుచేయడంపై ఏమాత్రమూ చూపడం లేదనేది నిష్ఠుర సత్యం.

రోడ్డు నిర్మాణం పనులతో మరింత అధ్వానం



కేసీసీ రోడ్డు నిర్మాణ సంస్థ చేస్తున్న బెంగళూరు హైవే నిర్మాణ పనులకు అవసరమయ్యే మెటీరియల్ తీసుకువెళ్లే భారీ వాహనాలు రాకపోకల వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. నిర్మాణ పనులు పూర్తయ్యాక ప్రభుత్వం రోడ్లను పూర్తిగా తిరిగి నిర్మించాలని డిమాండ్ చేస్తున్నాం. అలాగే తూగుండ్రం–బలిజ కండ్రిగ రోడ్డు మొత్తం దెబ్బతింది. వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. దుస్థితికి చేరిన రోడ్లపై ఇకనైనా అధికారులు దృష్టి సారించి బాగు చేయాలి.

– ముని రాజారెడ్డి, బుగ్గపట్నం

బొమ్మవారిపల్లె దారి పూర్తిగా ధ్వంసం



మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండే బొమ్మవారి పల్లె గ్రామానికి వెళ్లడానికి వాన వస్తే వాగు దాటి వెళ్లడానికి ఒక సమస్య అయితే, పాపిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న గ్రానైట్ ఫ్యాక్టరీల వల్ల, భారీ వర్షాలకు రోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. వర్షపు నీరు నిలిచి, ప్రయాణికులు, స్కూళ్లు, కాలేజీ విద్యార్థులు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులైనా దీనిపై దృష్టి సారించాలి.

– వెంకటేష్‌రెడ్డి, పాపిరెడ్డిపల్లె

అంబులెన్సు రావాలన్నా కష్టమే



రోడ్లు అధ్వాన స్థితికి చేరడంతో మండలంలోని మారుమూల గ్రామాలకు అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు రావాలన్నా కష్టమే. తిరువీధి కుప్పం కట్టపైన రాత్రుల్లో, వర్షం వచ్చినప్పుడు ప్రయాణించాలంటే కత్తి మీద సాము చేసినట్లే అవుతోంది. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నాం.

– గోవిందరెడ్డి, తిరువీధి కుప్పం

చేపల వేటకు వెళ్లకండి



కృష్ణాపురం జలాశయాన్ని సందర్శిస్తున్న సీఐ

కార్వేటినగరం: మండల పరిధిలోని మాధ్యమిక జలాశయమైన కృష్ణాజలాశయంలో చేపల వేటకు వెళ్లకండని స్థానిక సీఐ హనుమంతప్ప తెలిపారు. బుధవారం కృష్ణాపురం జలాశయాన్ని ఆయన, తహసీల్దార్ భగవతి, ఎంపీడీఓ చంద్రమౌళితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా జలాశయానికి సమీపంలో ఉన్న సూరయ్యపాళెం ఎస్టీకాలనీ వాసులతో సీఐ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడ్డ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జలశయానికి పెద్ద ఎత్తున వరద నీరు చేరుతోందని. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా జలాశయంలో చేపల వేటకు వెళ్లకూడదని ఆదేశించారు. గ్రామాల సమీపంలో ఉన్న వాగులు, వంకలను దాటేందుకు సాహసించకూడదని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారు సురక్షితమైన ప్రభుత్వ భవనాలకు చేరుకోవాలని చెప్పారు. అనంతరం సూరయ్యపాళెం ఎస్టీ కాలనీ వాసులకు అవగాహన కల్పించారు.



తుపాన్ ప్రభావంపై అవగాహన కల్పిస్తున్న సీఐ

విజయపురంలో కుంభవృష్టి



విజయపురం: మండలంలో రెండు రోజులు కురిసిన వర్షానికి బుధవారం జనజీవనం పూర్తిగా స్తంభించింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఖరీఫ్ పంట ముందుగానే నూర్పిడి చేయడంతో పెద్దగా పంట నష్టం జరగలేదు. ఇల్లత్తూరు, మహావీరపురం చెరువు నిండి కలుజు పారుతున్నాయి. రబీలో నాటిన వరి పొలాల్లో చేరిన వర్షపునీరు చెరువులను తలపిస్తున్నాయి. ఇక, మండల పరిషత్ కార్యాలయం బీటలు బారింది. భవనం ఉరుస్తుండడంతో గదులు చిత్తడి..చిత్తడిగా మారాయి.

పాదిరి వీఆర్వోగా జోన



సమస్యలు తెలుసుకుంటున్న వీఆర్వో

నిండ్ర: మండలంలోని పాదిరి గ్రామ సచివాలయ వీఆర్వోగా జోన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కొప్పేడు సచివాలయం నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. సమస్యలను తెలుసుకున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

- బురదమయమైన మట్టి రోడ్లు

నగరి : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా నియోజకవర్గవ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది మరో రోజు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు నిలిచింది. నగరిపేట ప్రాంతంలో నివాసాల్లోకి వర్షపు నీరు ప్రవహించి వీధులు జలమయమయ్యాయి. వర్షం నీటితో డ్రైయిన్ నీరు కలిసిపోయింది.

టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ ఇళ్ల నివాస ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు బురదమయమై అక్కడక్కడా గుంటల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో స్థానికులకు ఇబ్బంది తప్పలేదు. తెరణి వద్ద కుశస్థలి నదిలో కొంత మేరకు నీటి ప్రవాహం కనిపించింది. వరద నీటి కాలువల్లో మోస్తరుగా నీరు ప్రవహించింది. ఇంతటి వర్షంలోను గ్యాస్ సిలిండర్లకు మాత్రం తిప్పలు తప్పలేదు. బుధవారం ఓటీపీ సిస్టమ్ తెచ్చిన తంటాతో ఇండేన్ గ్యాస్ సిలిండర్ల ఏజెన్సీ కార్యాలయం వద్ద వర్షంలోనే గొడుగులు పట్టుకొని మరీ వినియోగదారులు క్యూలో నిలబడాల్సి వచ్చింది. నియోజకవర్గంలోని నిండ్రలో అత్యధికంగా 117.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా నగరి మండలంలో 77.6, విజయపురం మండలంలో 68.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.





నగరి పేటలో నివాసాలు చుట్టుముట్టిన వర్షపు నీరు, వర్షాలకు బురదమయమై అధ్వానంగా ఉన్న టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ ఇళ్ల వీధులు





ఉయ్యాల కాలువలో నీటి ప్రవాహం, సిలిండర్ల కోసం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద వర్షంలో బారులు తీరిన జనం

భక్తిప్రపత్తులతో కుంభాభిషేకం





కుంభాభిషేక వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కేరోజా, శ్రీకృష్ణుని రూపంలో హోమాగ్ని జ్వాల

నగరి: మండలంలోని దేశూరు అగరంలో నిర్మించిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో అష్ట బంధన విగ్రహ ప్రతిష్ఠ మహా కుంభాభిషేక వేడుకలు బుధవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక హోమ, కలశ పూజలు నిర్వహించారు. ఈ పూజలకు హాజరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజాకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. మూలవిరాట్‌ను దర్శించుకుని కర్పూర హారతులు, తీర్థ ప్రసాదాలు, వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అలాగే స్వామి వారి నందివాహన సేవలోనూ పాల్గొన్నారు. కార్యక్రమంలో నగరి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోమాగ్ని జ్వాలలో శ్రీకృష్ణుని ఆకారం

ఆలయంలో నిర్వహించిన హోమంలో శ్రీకృష్ణుని ఆకారంలో జ్వాల కనిపించిందని భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. కుంభాభిషేక పూజల్లో అగ్నిరూపంలో వచ్చి శ్రీకృష్ణుడు అందరినీ ఆశీర్వదించాడంటూ భక్తులు పేర్కొన్నారు.

క్రీడాకారులకు మాజీ మంత్రి అభినందన



క్రీడాకారులతో మాజీమంత్రి ఆర్కేరోజా

నగరి: జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరచి స్టార్ ఆఫ్ ఇండియా సాధించిన క్రీడాకారుడు కేసీ తేజేష్‌ను, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచి బెస్ట్ అప్ కమింగ్ ప్లేయర్ అవార్డు సాధించిన లక్ష్మీ నరసింహారెడ్డిని, సబ్ జూనియర్, జూనియర్ రాష్ట్ర స్థాయిపోటీలో ప్రతిభ చాటిన భానుప్రకాష్, ఇజాజ్, రిత్విక్, సిద్దిక్‌లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా అభినందించారు. బుధవారం తన స్వగృహంలో క్రీడాకారులను ప్రశంసించి మరిన్ని పతకాలు సాధించాలంటూ ఆకాంక్షించారు. నాలుగేళ్ల క్రితం క్రీడాకారులందరినీ మాజీ మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు నుంచి ఖర్చులన్నీ భరించి జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడలకు పంపించారని, అప్పటి నుంచి ప్రతి పోటీలోనూ తమ పిల్లలు సత్తా చాటి పతకాలు సాధిస్తున్నారని క్రీడాకారుల తల్లిదండ్రులు ఆర్కేరోజాకు కృతజ్ఞతలు తెలిపారు.

తుపాను ప్రభావంపై అవగాహన

- ఇన్‌చార్జ్ డీపీఓ పార్వతి

కార్వేటినగరం: తుపాన్ ప్రభావంపై అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి పార్వతమ్మ తెలిపారు. బుధవారం స్థానిక సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీపీఓ మాట్లాడుతూ తుపాన్ ఉధృతిని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లోతట్టు ప్రాంతాల్లో, గుడిసెల్లో నివాసాలు ఉంటున్న వారిని గుర్తించి వారిని వెంటనే సురక్షితమైన ప్రభుత్వ భవనాలకు తరలించి వారికి కావాల్సిన ఏర్పాట్లను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురువారం కూడా తుపాన్ ప్రభావం ఎక్కువ ఉన్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడించిందని, అధికారులు తమ కార్యాలయాల్లో ఉంటూ విపత్తులు జరక్కుండా చూడాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ డీపీఓను శాలువ కప్పి సన్మానించారు. ఈఓ నాగరత్నమ్మ, జూనియర్ అసిస్టెంట్ జహీర్, బిల్ కలెక్టర్ హరి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కేశవులు, వెల్ఫేర్ అసిస్టెంట్ చరణ్, డిజిటల్ అసిస్టెంట్ రోజా పాల్గొన్నారు.



డీపీఓను సన్మానిస్తున్న సర్పంచ్

పేదలను పట్టించుకునేవారు లేరు



భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

పాలసముద్రం: బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు గుడిసెల్లో ఇబ్బందులు పడుతున్న పేదలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రతిరోజూ కొండకు వెళ్లి మూలికలు తీసుకొచ్చి అందులో వచ్చిన నగదుతో జీవనం సాగిస్తున్న ఎస్టీలకు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో బయటకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మాత్రం కొండల సమీపంలో ఉన్న ఎస్టీ కాలనీకి చెందిన వారు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్టీలు వాపోతున్నారు. ప్రభుత్వం కూడా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థిక సాయం అందించాలనే ఆలోచన లేదు.

గతంలో ఆదుకున్న ప్రభుత్వం: గతంలో తుపాన్ ప్రభావం వల్ల ఇబ్బందులు పడుతున్న ఎస్టీ కుటుంబాలను, రెవెన్యూ అధికారులు వారికి ప్రత్యేక భవనం ఏర్పాటు చేసి భోజన ఏర్పాట్లు చేసి వారికి దుస్తులు అందించారు. అయితే ప్రస్తుతం గుడిసెల్లో వస్తుంటే కూడా పట్టించుకునే వారు కరువయ్యారని ఎస్టీ వాసులు తెలుపుతున్నారు.

ఇళ్లకే పరిమితం కండి

- కమిషనర్ మంజునాథ్ గౌడ్

పుత్తూరు: వాతావరణ అధికారులు హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. పిళ్లారిపట్టు వాగు వద్ద, బాలాజీ కాలనీ శ్మశాన వాటిక వాగుల వద్ద వాహనాల రాకపోకలను నిషేధించి, బ్యారికేడ్‌తో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈశ్వరాపురం రైల్వే అండర్ బ్రిడ్జిలో రాకపోకలకు అంతరాయంగా నిలిచిపోయిన నీటిని డీ–వాటర్ పంపింగ్ చేసి తొలగించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉన్న ప్రజలను, లోతట్టు ప్రాంత ప్రజలను పిళ్లారిపట్టులోని ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో పునరావాసం కల్పించారు. మున్సిపల్ కార్యాలయంలో తుపాను కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా 70750 67503, 79899 95876 నెంబర్లకు ఫోన్ చేసి కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ కార్తికేయన్ పాల్గొన్నారు.



పిళ్లారిపట్టు వాగు వద్ద రాకపోకలు బంద్





వాగు వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న మున్సిపల్ అధికారులు, ఈశ్వరాపురం అండర్ బ్రిడ్జి వద్ద నీటిని తోడుతున్న దృశ్యం